క్లుప్తంగా

రిటైర్డ్ ఆర్మీ జవాన్ ఘన సన్మానం



ఉప్పునుంతల: మండలంలోని కొరటికల్‌లో ఆర్మీ జవాన్ బెల్లంకొండ యాదయ్యకు ఆదివారం పదవీ విరమణ పొందారు. దీంతో ఆయన నివాసంలో యాదయ్య దంపతులను రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కేపీ మోహన్, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ, మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. 20 ఏళ్ల పాటు దేశ సేవ చేయడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్‌రెడ్డి, సైదులు, దాసు, రమేష్, అశోక్, భరత్, సురేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు నిరంతర పోరాటం

కొల్లాపూర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ కోసం నిరంతరం పోరాడుతామని దండోరా జిల్లా నాయకుడు బచ్చలకూర లక్ష్మణ్ మాదిగ అన్నారు. ఆదివారం మండలంలోని మాచినేనిపల్లిలో గ్రామస్థాయి దండోరా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీ ఇచ్చి మాదిగలను మోసం చేశాయన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడు శేఖర్, అధికార ప్రతినిధి ప్రకాష్, ఉపాధ్యక్షుడు శివ, సాయికృష్ణ, కార్యదర్శులుగా ఎల్లస్వామి కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దండోరా నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీఎస్పీ ప్రచారం

తెలకపల్లి: మండలంలోని చిన్నముద్దునూరు, కార్వంగ, తాళ్లపల్లి తదితర గ్రామాలలో ఆదివారం బీఎస్పీ నాయకులు ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించాలని మండల అధ్యక్షుడు శివశంకర్ కోరారు.

భక్తులకు రక్షణ కల్పించండి

మన్ననూర్: తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు మెట్లదారి గుండా వెళ్లే భక్తులకు రక్షణ కల్పించాలని విశ్వహిందు పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అలిపిరి మెట్ల దారి గుండా స్వామి వారికి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు కాలినడక ద్వారా వెళ్తారని పేర్కొన్నారు. కొంత కాలంగా సమీప అటవీ ప్రాంతం నుంచి వస్తున్న చిరుత పులులు తరుచుగా భక్తులపై దాడులు చేస్తున్నా టీటీడీ సిబ్బంది పట్టించుకోకపోవడం దారుణమన్నారు. శనివారం ఓ బాలికపై చిరుత దాడి చేసి చంపివేసిన విషయం విదితమే. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆలయం నిర్వాహకులు, ఏపీ ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

కల్వకుర్తి: రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంపై ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, వైస్ ఎంపీపీ గోవర్ధన్, అర్జున్ రావు తదితరులతో పాటు పలువురు ఉన్నారు.

రేపటి నుంచి ధ్యాన, యోగా శిక్షణ తరగతులు

అచ్చంపేట: పట్టణంలోని సాయి పిరమిడ్ ధ్యాన మందిరంలో ఈనెల15 నుంచి 24 వరకు ధ్యాన, వైద్య, యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంబు భాస్కర్, శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.30 నుంచి 7.30 వరకు అలాగే సాయంతం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. 15న సాయంత్రం 6 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు.

వైస్ ప్రెసిడెంట్‌కు సన్మానం



కల్వకుర్తిరూరల్: వాసవీక్లబ్ ఇంటర్‌నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జూలూరి రమేష్‌బాబును ఆదివారం ఘనంగా సన్మానించారు. వాసవీ క్లబ్ జిల్లా రెండో కేబినెట్ సమావేశానికి హాజరైన రమేష్‌బాబును గవర్నర్ రామకృష్ణ, ప్రవీణ్ తదితరులతో పాటు పలువురు సన్మానించారు. వాసవీ క్లబ్ సేవలను విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కల్మిచర్ల రమేష్, శివ, జగదీశ్వర్, గోపాల్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ రేషన్ కష్టాలు..



ఉప్పునుంతల రేషన్‌షాపులో బియ్యం తీసుకుంటున్న వినియోగదారులు

- 27 గ్రామ పంచాయతీలకు 23 రేషన్ షాపులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఉప్పునుంతల: కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ప్రజలకు రేషన్ కష్టాలు మాత్రం తీరడంలేదు. నెలనెలా కిలోమీటర్ల దూరం వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో రేషన్ దుకాణాలు స్థానికంగా లేక సరుకులు తీసుకోవడానికి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా కిలోమీటర్లమేర దూరం కాలినడకన, వాహనాలపై వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాల్సిన దుస్థితి నెలకొందని లబ్ధిదారులు వాపోయారు. మరో గ్రామ పంచాయతీకి వెళ్లి సరుకులు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యం విలువ కంటే ఆటో చార్జీలే అధికం అవుతున్నాయని రేషన్ వినియోగదారులు వాపోతున్నారు. మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు, 38 ఆవాస గ్రామాలుండగా ప్రస్తుతం 23 రేషన్‌షాపులు మాత్రమే ఉన్నాయి. 9724 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిలో పెద్ద గ్రామ పంచాయతీలుగా ఉన్న ఉప్పునుంతల, తాడూరు, వెల్టూర్, పెనిమిళ్ల, కాంసానిపల్లి లో రెండేసి రేషన్ షాపుల చొప్పున పది షాపులు ఉన్నాయి. మిగిలిన 22 గ్రామ పంచాయతీల పరిధిలో కేవలం 13 రేషన్ షాపులు మాత్రమే ఉన్నాయి.

వివరాలు ఇలా..

మండలంలోని తిప్పాపూర్ గ్రామ పంచాయతీతో పాటు పంచాయతీ పరిధిలోని తిప్పాపూర్ తండాలకు చెందిన వినియోదారులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడూరు వెళ్లి రేషన్ సరకులు తీసుకోవాల్సిన పరిస్థితి. అదేవిధంగా మొల్గర గ్రామ పంచాయతీకి చెందిన వినియోదారులు పెద్దాపూర్‌కు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అదేవిధంగా రంగంపేట, కొత్తరాంనగర్ గట్టుకాడిపల్లికి చెందిన గ్రామాల వినియోగదారులు ప్రతినెలా ఉప్పునుంతలకు వెళ్లక తప్పడం లేదు. ఈరట్వానిపల్లి, లత్తీపూర్ రెండు గ్రామ పంచాయతీలకు చెందిన రేషన్ వినియోగదారులు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న గువ్వలోనిపల్లి గ్రామ పంచాయతీకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సీబీ తండా, పూర్యానాయక్ తండా గ్రామ పంచాయతీలకు చెందిన వినియోగదారులు నెలనెలా పెనిమిళ్లకు వెళ్లాల్సిందే. ఉచిత బియ్యం విలువ కంటే రవాణా చార్జీలే అధికమవుతున్నాయని ఆయా గ్రామాల రేషన్ వినియోగదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి కనీసం గ్రామ పంచాయతీల్లో రేషన్ షాపులు ఏర్పాటుచేసి స్థానికంగానే సరుకులు అందజేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

మూడు కిలోమీటర్ల నడక



ప్రతి నెలా ఉప్పునుంతల రేషన్ షాపులో ఇచ్చే బియ్యం కోసం మూడు కిలోమీటర్లు నడవక తప్పడం లేదు. నాలుగేళ్ల కిందట కొన్ని నెలలు గ్రామంలోనే రేషన్ బియ్యం ఇచ్చారు. సజావుగా సాగిని కొన్ని రోజుల తర్వాత ఎప్పటిమాదిరి మండల కేంద్రంలోనే రేషన్ బియ్యం ఇస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఊళ్లోనే రేషన్ షాపు ఏర్పాటు చేయాలి.

– బొల్లు పార్వతమ్మ, గట్టుకాడిపల్లి

ఇబ్బందులు లేకుండా చర్యలు

కొత్త గ్రామ పంచాయతీల్లో రేషన్ షాపుల ఏర్పాటు విషయంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి నివేదిక అడగలేదు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

శైలేంద్రకుమార్, తహసీల్దార్

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి

చారకొండ: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని జూపల్లిలో కొన్ని రోజులుగా ఆర్‌బీఆర్ భవన్‌లో సత్యహరిచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. శిక్షణ ఇస్తున్నా షఫీయాను ఎమ్మెల్సీ అభినందించారు. గ్రామంలో శిక్షణ నిరంతరం కొనసాగెలా చూడాలని అవసరం కుట్టు మిషన్లను అందిస్తానని పేర్కొన్నారు. వెంకటయ్య యాదవ్, సత్య హరిచంద్ర ఫౌండేషన్ చైర్మన్ రాములు యాదవ్, నాయకులు సంజీవ్ యాదవ్, బాలేమియా తదితరులు ఉన్నారు.

మండలంలోని జూపల్లి మాజీ సర్పంచ్ కామల్ల రామలింగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం దశదినకర్మ సందర్భంగా జూపల్లిలో రామలింగం చిత్రపటానికి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి పూలమాలలతో నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆదేవిధంగా చారకొండ వైస్ ఎంపీపీ తనయుడు వెంకటయ్య యాదవ్ రూ.3500 ఆర్థికసాయం అందజేశారు. వారి వెంట నాయకులు భూపతిరెడ్డి, సంజీవ్ కుమార్, వెంకటయ్య యాదవ్, రాములు యాదవ్, బాలేమియా తదితరులు ఉన్నారు.

వెల్దండ: మండలంలోని శంకరకొండతండాలో ఆదివారం సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి భూమిపూజ చేశారు. సర్పంచ్ కోమిటి, ఎంపీటీసీ మోతిలాల్‌నాయక్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, నాయకులు నారాయణ, సురేందర్‌రెడ్డి, జంగయ్యయాదవ్, శేఖర్‌ముదిరాజ్, హరికిషన్‌నాయక్, రాజశేఖర్, టాక్యనాయక్, రవిందర్‌నాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు రామచంద్రారెడ్డి, పత్యానాయక్, భీరయ్య, కుమార్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదివారం పరామర్శించారు. రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట వెల్దండ సర్పంచ్ శ్రీపతిరెడ్డి, సంజీవ్ యాదవ్, ఆనంద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కొల్లాపూర్‌లో కాంగ్రెస్‌దే విజయం



మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు

పెంట్లవెల్లి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజక వర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలవడం ఖాయమని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీటు ఎవరికి ఇచ్చినా సంపూర్ణ మద్దతు ఇస్తానన్నారు. ఎంతో మంది త్యాగాల ఫలితమే తెలంగాణ వచ్చిందన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీకి రుణపడి ఉండాలన్నారు. ప్రస్తుత బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ దుర్మార్గపు రాజకీయాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్‌కు ప్రజలే బుద్ధి చెప్తారు

బీఆర్‌ఎస్ అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి అభిలాష్‌రావు అన్నారు. అమలు కాని హామీలు ఇస్తూ ప్రభుత్వం కాలాయాపన చేస్తూ ప్రజలను నిలువునా వంచిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, నర్సింహనాయుడు, కోట్ల సురేందర్, ఖాజామైనుద్దీన్, గోపినాయక్, గోవింద్‌గౌడ్, బీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న శివయ్య గౌడ్

తెలకపల్లి: సనాతన ధర్మ పరిరక్షణే వీహెచ్‌పీ ధ్యేయమని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు శివయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో యోగా భవనంలో విశ్వహిందూ పరిషత్ ప్రఖండ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ ఏర్పడి 60 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ప్రతి గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేసి వీహెచ్‌పీని బలోపేతం చేయాలని తెలిపారు. సాధు సంతువుల పాదయాత్రలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విభాగ్ కార్యదర్శి నరేందర్, శివయ్య గౌడ్, సుధాకరయ్య, బాలస్వామి, మాతృమండలి అధ్యక్షురాలు సుకన్య, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ కార్యవాహ పత్తికొండ రాము, ప్రఖండ అధ్యక్షుడు కిషోర్, శివకృష్ణ, రామకృష్ణ, భక్తతుకారాం, ఉమాపతి, చెన్నబాబు, రమేష్, వివిధ గ్రామాలకు చెందిన పలువురు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం



పెద్దకొత్తపల్లి: మండలంలోని మారేడుదిన్నెలో వాగు కల్వర్టులు, మెటల్ రోడ్డు నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకుడు చంద్రయ్య మాట్లాడుతూ పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని రహదారి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఉప సర్పంచ్ శ్రీధర్‌రావు, ఎంపీటీసీ మంగమ్మ అమృనాయక్, అరవింద్, చిన్నబాలయ్య, లక్ష్మయ్య, ఏఈ సాయిరాం పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

బిజినేపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఆయా శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు హాజరుకావాలని తహసీల్దారు శ్రీరాములు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కోడేరు: మండలంలోని బావాయిపల్లికి చెందిన పది మంది లబ్ధిదారులకు రూ.1.84 లక్ష విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయంలో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి ఆసరాగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కాశిరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

దోమలపెంట: మండలంలోని శ్రీశైలం ప్రాజెక్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96వ సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులతో పాటు ప్రస్తుత హెచ్‌ఎంను ఘనంగా సన్మానించారు. ప్రాంతం, వారి కుటుంబ నేపథ్యం, ఉద్యోగాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని పేర్కొన్నారు.

మంత్రి హామీ మేరకే సమ్మె విరమణ



మాట్లాడుతున్న ఆంజనేయులు

కల్వకుర్తిరూరల్: 35 రోజుల పాటు సమ్మె చేసి తాత్కాలికంగా మంత్రి దయాకర్‌రావు హామీతో పంచాయతీ కార్మికులు సమ్మె విరమించారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో పంచాయతీ కార్మికుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే మరో సారి సమ్మె చేసేందుకు కార్మికులు సిద్ధం కావాలన్నారు. కొన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ సిబ్బంది కార్మికులను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహేశ్, మైసమ్మ, పరశురాములు, మల్లేష్, సాయమ్మ, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చత్రునాయక్‌కు సన్మానం

అచ్చంపేట రూరల్: ఏఐసీసీ నిర్వహించిన శిక్షణను పూర్తి చేసుకుని ఆదివారం పట్టణానికి వచ్చిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ చత్రునాయక్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కర్ణాటక రాష్ట్రంలోని ఘట్టప్రభ, మహారాష్ట్రలోని సేవాగ్రం గాంధీ ఆశ్రమంలో 20 రోజుల పాటు శిక్షణ పొందారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, నాయకులు పాల్గొన్నారు.



20న సైంటిఫిక్ టెంపర్ డే



కొల్లాపూర్: విద్యార్థులకు సైన్స్‌పై మక్కువ పెంచేందుకు 20వ తేదీన కొల్లాపూర్‌లో సైంటిఫిక్ టెంపర్ డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు జితేందర్ తెలిపారు. ఆదివారం పట్టణంలో నిర్వహణ అంశాలపై చర్చించేందుకు సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు, రమణ, మధుసూదన్, కేతపోగు మహేష్, తిరుపతి నాయక్, దాసు తదితరులున్నారు.

సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



మాట్లాడుతున్న ఆర్ శ్రీనివాసులు

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఈసీ ఏఎన్ఎం, సెకండ్ ఏఎన్‌లను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 16 నుంచి నిర్వహించనున్న నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. వారాంతపు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి అశోక్, సత్యానారాయణ, పరమేశ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యదర్శిగా మల్లేష్



కల్వకుర్తి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శిగా మల్లేష్‌ను నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆదివారం నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్, లక్ష్మయ్య గౌడ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



బాధితులతో మాట్లాడుతున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

కల్వకుర్తిరూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారితో పాటు ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు ప్రభుత్వం రూ.20 లక్షలు చెల్లించి ఆదుకోవాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ నాయకుడు ఆచారి డిమాండ్ చేశారు. ఆదివారం ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఒకే రోజు 5 మంది చనిపోవడం బాధాకరమన్నారు. అదేవిధంగా మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎంపీ రాములు పేర్కొన్నారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నర్సింహా, దుర్గాప్రసాద్‌తో పాటు బిజేపీ నాయకులు ఉన్నారు.

తిరంగా ర్యాలీ

అచ్చంపేట రూరల్: ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ దేవాలయం నుంచి ఓం చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. దేశ భక్తి చాటేందుకే తిరంగా ర్యాలీ నిర్వహించామని నాయకులు తెలిపారు. బాలాజీ, సతీష్‌మాదిగ, రేణయ్య, గోపాల్, రవీందర్, భరత్‌చారి, తేజస్విని, మహేశ్వరి, అనంతగిరిచారి, రాజు, ఆంజనేయులు, తిర్పతయ్య, శివాజీ, నరేష్, రామాంజనేయులు, శ్రీనివాసులు, ప్రణయ్ పాల్గొన్నారు.



అచ్చంపేటలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో ఆజాది కా అమృతోత్సవ్‌లో భాగంగా బీజేపీ పట్టణ కన్వీనర్ రాము ఆధ్వర్యంలో ఆదివారం నాయకులు మొక్కలు నాటారు. బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యమన్నారు. స్వాతంత్ర్య ఫలాలు అందరికి దక్కేలా ప్రధాని నరేంద్రమోడీ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, కృష్ణగౌడ్, నర్సింహా, వివేకానంద, శేఖర్, నరేష్‌గౌడ్, బాబీదేవ్, శరత్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్‌నగర్‌లో..

కాంగ్రెస్‌లో చేరిక



కొల్లాపూర్: మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన పలువురు ఆదివారం మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు సమక్షంలో చేరారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌రావు, బిచ్చారావు, కృపాకర్‌రావు, సోమన్‌గౌడ్ తదితరులున్నారు.

ఘనంగా శీతల భవాని వేడుకలు



నైవేద్యం తీసుకొస్తున్న మహిళలు

చారకొండ: మండలంలోని సారంబండా తండాలో శీతల భవాని వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గిరిజన మహిళలు వేషధారణతో నృత్యాలు చేస్తూ భవాని ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు పండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో గిరిజన మహిళలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

అచ్చంపేట: మహిళా శిశు సంక్షేమశాఖ పోషణ్ అభియాన్ బ్లాక్ కో–ఆర్డినేటర్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎస్పీడీఎస్ కంప్యూటర్ ఆపరేటర్ ప్రదీప్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు క్రమబద్ధీకరించాలని కోరారు.